ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు: డీఆర్వో

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో సెక్టార్, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలకు శిక్షణ నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ 'జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఎన్నికల నిర్వహణలో మైక్రోఅబ్జర్వర్ల పాత్ర కీలకం. ఈ నెల 27న పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి. నివేదికను త్వరగా అందజేయాల'ని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపకలెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

అమ్మో! జీబీఎస్



- జిల్లాలో రెండు కేసులు నమోదు
- ఇప్పటికే ఒక బాలుడి మృతి
- అవగాహన కల్పించని జిల్లా వైద్యఆరోగ్యశాఖ
- జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే..



శ్రీకాకుళం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి)

జిల్లావాసులను కొత్త వైరస్ వణికిస్తోంది. మొన్నటి వరకూ మహారాష్ట్ర, తెలంగాణల్లో కలకలం రేపిన గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్).. ప్రస్తుతం రాష్ట్రంలో కూడా చాపకింద నీరులా వ్యాపించింది. జిల్లాలో అధికారుల నివేదిక ప్రకారం రెండు కేసులు నమోదయ్యాయి. ఇటీవల సంతబొమ్మాళి మండలంలో పదేళ్ల బాలుడు ఈ వ్యాధి లక్షణాలతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లావాసులు భయాందోళన చెందుతున్నారు. కాగా.. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి.. అప్రమత్తం చేయాల్సిన వైద్యఆరోగ్యశాఖ మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. సంతబొమ్మాళి మండలంలో బాలుడి మరణించిన గ్రామంలో కొన్ని నమూనాలను వైద్యశాఖ అధికారులు సేకరించారు. ఆతర్వాత జీబీఎస్ గురించి ఎటువంటి అవగాహన కల్పించలేదు. విశాఖపట్నం వైద్యులు బాలుడి మృతికి జీబీఎస్ కారణం అని నిర్ధారించినా.. ఆ పరీక్షలు సరికాదని.. మరిన్ని పరీక్షలు నిర్వహిస్తేనే నిర్ధారించగలమని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు. దీనిపై ప్రజలను గందరగోళానికి గురిచేయకుండా.. వైద్యఆరోగ్యశాఖ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రజలు కూడా వ్యక్తిగత జాగ్రత్తలు పాటించి.. మెరుగైన

(మిగతా 6వ పేజీలో..)

● జీబీఎస్ లక్షణాలివీ..

గులియన్ బారే సింద్రోమ్ (జీబీఎస్).. ఇది ఒక అరుదైన నరాల వ్యాధి. దీనిని ఆటో ఇమ్యూన్ వ్యాధి అని కూడా అనొచ్చు. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ, నరాలపై ఈ వైరస్ దాడి చేస్తుంది. ఫలితంగా కండరాల బలహీనత, గొంతు నొప్పి, నడవలేని స్థితి.. అలిసిపోయినట్లుగా అనిపిస్తుంటుంది. మొదటి దశలో చికాకు, నడుము నొప్పి ఉంటుంది. పెరాల్సిస్ మాదిరి పాదాలు, చేతులు, ముఖం నిశ్చేష్టంగా మారుతుంది. చర్మంలో సూది గుచ్చినట్లుగా అనిపిస్తుంది. చేతులు, కాళ్లలో బలహీనత, నడవలేని స్థితి ఏర్పడుతుంది. కొన్ని కేసుల్లో కండరాలు పూర్తిగా పనిచేయకపోవడం, గుండె వేగం మారడం, ఊపిరితిత్తుల సమస్యలు సంభవిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలు.. ఎక్కువగా వైరల్ లేదా బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ తర్వాత కనిపిస్తాయి. బ్యాక్టీరియా(కెంపీనోబాక్టర్ జెజునీ) ఇన్ఫెక్షన్ వల్ల తీవ్రమైన నడుమునొప్పి, డయేరియా ముందుగా వస్తుంది. అలాగే ఇన్ఫ్లుయెంజా(ఫ్లూ), కొవిడ్-19 వంటి వైరస్ ఇన్ఫెక్షన్లు, హైపటైటిస్, హెచ్ఐవీ వంటి వైరస్‌లు, వ్యాక్సినేషన్ (అలర్జిక్ ప్రతిస్పందన వల్ల కొందరిలో మాత్రమే వస్తుంది), శస్త్రచికిత్స, ఫిజికల్ ట్రామా (గాయం) ఇటువంటివి అనంతరం రేర్ ఘటనల్లో జీబీఎస్ సంభవించే అవకాశముంది.

● ఎలా గుర్తిస్తారు..

ఎన్‌సీఎస్ (నెర్వ్ కండక్షన్ స్టడీస్) నరాల టెస్టులు, లంబార్ పంక్చర్ (మెదడు ద్రవ పరీక్ష), ఈఎంజీ(ఎలక్ట్రోమయోగ్రఫీ) కండరాల పనితీరు వంటి పరీక్షలతో జీబీఎస్ గుర్తించేందుకు వీలుంటుంది. ఈ వ్యాధి నుంచి సుమారు మూడు నెలల నుంచి ఒక ఏడాది వరకు పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుంది. కొంత మందికి చేతులు, కాళ్లలో బలహీనత లేదా నొప్పి అలానే ఉండిపోయే అవకాశముంటుంది.



చికిత్స.. నివారణ..

● జీబీఎస్ అత్యంత అరుదుగా సంభవిస్తుంది. సకాలంలో వ్యాధి లక్షణాలు గుర్తించి.. వైద్యుడి వద్ద చికిత్స తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చు. వైరల్, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లను నివారించడానికి హ్యాండ్ వాష్, పరిశుభ్రత పాటించాలి. శరీరంలో ఏదైనా ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు తక్షణమే చికిత్స తీసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలి పాటించాలి. జీబీఎస్ తీవ్రతను బట్టి చికిత్స మారుతుంది. ఇది పూర్తిగా నయమవుతుందని చెప్పినా.. కొందరికి గడిచిన అనుభవాల వల్ల సమస్య మిగిలిపోతుంది.

- **ఐవీఐజీ (ఇమ్యునోగ్లోబ్యులిన్ థెరపీ):** ఇది రోగనిరోధక వ్యవస్థను నియంత్రించి నరాలపై దాడిని తగ్గిస్తుంది.
- **ప్లాస్మా ఎక్సేంజ్ (ప్లాస్లాఫెరిసిస్):** రక్తంలోని దుష్ప్రభావ కారకాలను తొలగించేందుకు వీలుంటుంది.
- **ఆక్సిజన్ సపోర్టు:** ఊపిరితిత్తులపై ప్రభావం పడితే వెంటిలేటర్ అవసరం ఉంటుంది.
- **ఫిజియోథెరపీ:** మళ్లీ మళ్లీ నడిపించడం.. శరీర కండరాలలో కదలికలు ఉండేలా చేస్తారు.



కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

ఇటలీలో ఉద్యోగాలంట!

- ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు
- నెలల తరబడి కాలయాపన.. మోసపోయిన బాధితులు
- న్యాయం చేయాలని పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో నిరుద్యోగ యువతను ఓ ప్రబుద్ధుడు టార్గెట్ చేశాడు. వారికి ఇటలీలో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించాడు. వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసి.. చివరికి మోసం చేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సంతబొమ్మాళి మండలం మోడీ నర్సాపురానికి చెందిన ఓ వ్యక్తి.. కొంతకాలంగా కోటబొమ్మాళిలో నిరుద్యోగులకు శిక్షణ పేరిట ఒక కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. ఇటలీలో ఉద్యోగాలు కల్పిస్తామని యువతను నమ్మించి.. రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేసేవాడు. ఈ క్రమంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన సుమారు 42 మంది యువత వద్ద సుమారు రూ.కోటి వసూలు చేశాడు. ఎన్నాళ్లయినా వారికి ఇటలీలో ఉద్యోగాలు కల్పించకుండా కాలయాపన చేస్తుండడంతో.. బాధితులంతా తాము మోసపోయామని గ్రహించారు. న్యాయం చేయాలంటూ మంగళవారం కోటబొమ్మాళి పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేశారు. 'విదేశీ ఉద్యోగాల పేరిట ఓ వ్యక్తి మా వద్ద డబ్బులు తీసుకున్నాడు. వీసాలు, పాస్‌పోర్టులు చేయిస్తున్నామంటూ నెలల తరబడి తిప్పుతున్నాడు. అప్పు చేసి రూ.లక్షల్లో చెల్లించామని.. ఉద్యోగాలు లేకపోయినా మా డబ్బులు మాకు తిరిగి ఇవ్వాలని కోరుతున్నా కాలయాపన చేస్తున్నాడు. ఆయనపై చర్యలు తీసుకుని.. మాకు న్యాయం చేయాల'ని బాధిత యువకులు పోలీసులను వేడుకున్నారు. కాగా.. స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్నా.. పోలీసుల నుంచి స్పందన లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఎస్ఐ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా.. బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే.. దర్యాప్తు చేస్తామన్నారు.

ప్రాణం తీసిన పొగమంచు

- ట్రాక్టర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం
- ఇద్దరు యువకుల దుర్మరణం
- కంచిలిలో ఘటన.. నువ్వలరేవులో విషాదఛాయలు


ధర్మా, షణ్ముఖ మృతదేహాలు, నుజ్జయిన ద్విచక్ర వాహనం


బెహరా ధర్మా, షణ్ముఖ (ఫైల్)

వజ్రపుకొత్తూరు/కంచిలి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ స్నేహితులు. రెడీమేడ్ వస్త్రవ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. వస్త్రాల కొనుగోలు కోసం ఒడిశా వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. అర్ధరాత్రి వేళ.. ఓవైపు పొగమంచు, మరోవైపు అతివేగం కారణంగా ఎదురుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో.. ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగిల్చారు. వివరాల్లోకి వెళితే..

కంచిలి జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో.. వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు గ్రామానికి చెందిన బెహరా ధర్మ(33), బెహరా షణ్ముఖ(35) మృతి చెందారు. వీరిద్దరూ టైలరింగ్, రెడీమేడ్ దుస్తుల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. ఏటా ఉగాది, శ్రీరామనవమి పర్వదినాల సందర్భంగా ఒడిశాలో వస్త్రాలు కొనుగోలు చేసి.. ఇక్కడకు తెచ్చి విక్రయించేవారు. ఈ నేపథ్యంలో వారిద్దరూ ఒడిశా రాష్ట్రం బరంపురంలో వస్త్రాలు కొనుగోలు చేసి.. ఒడిశాలోని సుమంది గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం రాత్రి ఒడిశా నుంచి తిరిగి ద్విచక్రవాహనం నువ్వలరేవు వస్తున్నారు. ఈ క్రమంలో కంచిలి లోని దాబా సమీపంలో హైవేపై ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయింది. అర్ధరాత్రి వేళ పొగమంచు కారణంగా ఎదురుగా వెళ్తున్న వాహనం కనపడకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. అతివేగంగా వాహనం నడపడం కూడా ప్రమాదానికి మరో కారణమని చెబుతున్నారు.

● సంఘటనా స్థలాన్ని కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు పరిశీలించారు. వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి.నిహార్‌కు సమాచారం ఇచ్చారు. వజ్రపుకొత్తూరు పోలీసుల ద్వారా విషయం తెలుసుకుని మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు.

దేవుడా మాకు దిక్కెవరు

ధర్మారావుకు భార్య శృతితోపాటు ఒక పాప, బాబు ఉన్నారు. ఇద్దరూ చిన్నపిల్లలే. షణ్ముఖకు భార్య పూజతోపాటు, కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆయన భార్య గర్భవతి. ధర్మారావు, షణ్ముఖ మృతితో వారి కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలంచారు. దేవుడా మాకు దిక్కెవరంటూ రోదిస్తున్నారు. నువ్వలరేవులో వారిద్దరికీ దహన సంస్కారాలు చేపట్టారు. ఈ ఘటనతో నువ్వలరేవు గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. వారిద్దరూ అందరితో కలిసి సరదాగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. మృతులిద్దరూ నిరుపేదలేనని, ఆయా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ప్రత్యేక అలకంరణలో వాసుదేవుడు

వైభవంగా వాసుదేవుని బ్రహ్మోత్సవాలు

- మందసలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

6లో

సానుకూల దృక్పథం.. విజయానికి సోపానం

- పరీక్షలంటే భయం వద్దు
- అతిగా తినవద్దు
- ఆరోగ్య భద్రతా అవసరమే
- విద్యార్థులకు నిపుణుల సూచనలు

6లో

'ఎలుగు' సంచారంతో హడల్

- తరచూ దాడి ఘటనలు
- భయాందోళనలో ఉద్దానం వాసులు
- వాహనానికి అడ్డుగా వచ్చిన ఎలుగుబంటిని తప్పించబోయి దివ్యాంగుడి మృతి



వజ్రపుకొత్తూరులోని తోటలో సంచరిస్తున్న ఎలుగుబంటి


జయరాం మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య కున్ని, బంధువులు

వజ్రపుకొత్తూరు/ హరిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతవాసులను ఎలుగుబంట్ల బెడద వెంటాడుతోంది. ప్రస్తుతం జీడిపంట సీజన్ కావడంతో ఎలుగుల సంచారం పెరిగింది. వజ్రపుకొత్తూరు, చినకొత్తూరు, కిడిసింగి పరిసర గ్రామాల తోటలలో మంగళవారం ఎలుగుబంటి సంచారంతో ప్రజలు హడలిపోయారు. రెండు రోజులుగా ఎలుగుబంటి తోటల్లో తిరుగుతుండడంతో ప్రజలు తోటలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇదే ప్రాంతంలో గత ఏడాది ఎలుగుబంటి దాడితో ఐదుగురు మృతి చెందగా మరో నలుగురు గాయపడ్డారు. దీంతో ఎలుగుబంటి సంచారం అంటేనే ఈ ప్రాంతవాసులు హడలిపోతున్నారు. తాజాగా మందస మండలం ముకుందపురం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మందసకు చెందిన దివ్యాంగుడు తామాడ జయరాం(40) మృతి చెందగా.. అతని భార్య కున్నికు తీవ్ర గాయాలయ్యాయి. దంపతులు వారి త్రి చక్రవాహనంపై సోంపేట నుంచి మందస వస్తుండగా.. ముకుందపురం వద్ద ఎలుగుబంటి అడ్డుగా వచ్చింది. దీన్ని తప్పించబోయిన జయరాం దివ్యాంగుడు కావటంతో వాహనాన్ని అదుపులోకి తెచ్చుకోలేకపోయాడు. దీంతో వాహనం రోడ్డుపైనే బోల్తాపడింది. జయరాం తలకు బలమైన గాయమవటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్యకు కాళ్లు, ముఖంపై గాయాలయ్యాయి. జయరాం కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పదేళ్ల కిందట త్రిచక్ర వాహనాన్ని అందించటంతో పరిసర గ్రామాలకు కూడా పనికి వెళ్లేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఇలా ప్రమాదాలతోపాటు తరచూ ఎలుగుబంట్లు దాడుల ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఈ ప్రాంతవాసులు ఆవేదన చెందుతున్నారు. జీడిపంట సీజన్ కావడంతో తోటల్లో పనులుంటాయని, అయితే ఆ సమయంలో ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో ఆందోళన కలిగిస్తోందని కిడిసింగి సర్పంచ్ నర్తు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అటవీ శాఖధికారులు స్పందించి ఎలుగుబంటి సంచారాన్ని నియంత్రించాలని కోరుతున్నారు.

బీమా ఉన్నా.. ఆసక్తి లేదు

- మామిడి తోటల ఇన్సూరెన్స్‌కు మొగ్గుచూపని రైతులు
- జిల్లాలో 2,568 హెక్టార్లలో పెంపకం
- ఆశించిన స్థాయిలో కనిపించని పూత


పూత తక్కువగా వచ్చిన మామిడిచెట్లు

టెక్కలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఉద్యానవనశాఖ మామిడి పంటలకు కూడా బీమా (ఇన్సూరెన్స్) సౌకర్యం కల్పించినా.. రైతులు ఆసక్తి చూపడం లేదు. హెక్టారుకు రూ.1,800 చెల్లిస్తే చాలని.. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లినా.. ఆశించినస్థాయిలో దిగుబడి లేకపోయినా పరిహారం దక్కుతుందని ఉద్యానవన శాఖ అధికారులు ప్రచారం చేశారు. కానీ రైతులు మాత్రం బీమాకు వెనుకంజ వేస్తున్నారు. జిల్లాలో 2,568 హెక్టార్లలో మామిడితోటలు ఉన్నాయి. కాగా కనీసం 500 హెక్టార్లకు కూడా ఇన్సూరెన్స్ చేయలేదు. కొత్తూరు, జి.సిగడాం, కోటబొమ్మాళి, బూర్జ, నందిగాం, సారవకోట, టెక్కలి, మెళియాపుట్టి, పాతపట్నం, పలాస, మందస, సోంపేట, ఎచ్చెర్ల, రణస్థలం తదితర మండలాల్లో రైతులు ఎక్కువగా మామిడి తోటలు సాగు చేస్తున్నారు. బంగినపల్లి, చెరుకురసం, గోవా, సువర్ణరేఖ, కలెక్టర్, నువ్వుజీడి, నీలాలు, దేశవాళీ రకాలు మామిడిని రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. మామిడి తోటలకు పూత ఎక్కువ రావాలని కొంతమంది రైతులు కల్టార్ మందును పిచికారీ చేస్తున్నారు. కానీ ఎరువులను మాత్రం సక్రమంగా వినియోగించడం లేదు. దీంతో మామిడి చెట్లకు పూత వచ్చినా.. కల్టార్ మందు ప్రభావంతో చెట్లు బలాన్ని కోల్పోతున్నాయి. ఆపై దిగుబడులు తగ్గుతున్నాయి. మరికొంతమంది రైతులు జనవరి నెలాఖరు, ఫిబ్రవరి మొదటి వారంలో మామిడి పూత కోసం మళ్లీకే పిచికారీ చేశారు. కానీ ఈ ఏడాది ఆశించినస్థాయిలో మామిడి పూతలేక రైతులు దిగులు చెందుతున్నారు. మరోవైపు మంచు ప్రభావంతో మామిడి పూత మాడిపోతోందని ఆవేదన చెందుతున్నారు. కాగా బీమా సౌకర్యం ఉన్నా.. ఈ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించవనే ఉద్దేశంతో చాలామంది మామిడి రైతులు ఇన్సూరెన్స్‌కు వెనుకంజ వేస్తున్నారని తెలుస్తోంది.

అవగాహన కల్పిస్తున్నాం..

మామిడి తోటలకు బీమా చేయించాలని రైతులకు అవగాహన కల్పించాం. అయినా రైతులు ముందుకు రాలేదు. ఈ ఏడాది మామిడిపూత అంతంతమాత్రమే కనిపిస్తోంది. మామిడితోటల్లో దిగుబడులు, ఇన్సూరెన్స్ సౌకర్యాలపై రైతులకు మరింత అవగాహన కల్పిస్తున్నాం.

-శైలజ, ఉద్యానవనశాఖ సహాయ సంచాలకురాలు

రెవెన్యూ సేవల్లో తీవ్ర జాప్యం

- తహసీల్దార్లు లేక ప్రజలకు ఇబ్బందులు

8లో

కొనుగోలు టార్గెట్ అయిపోయింది

- బూర్జలో ధాన్యం సేకరణ నిలిపేయడంతో రైతుల ఆందోళన

7లో



సానుకూల దృక్పథం.. విజయానికి సోపానం

- పరీక్షల సమయంలో భయం వద్దు ● అతిగా తినవద్దు
- ఆరోగ్యాన్ని కాపాడుకోవడమూ అవసరమే
- విద్యార్థులకు నిపుణుల సూచనలు

నరసన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి)

ఇది పరీక్షల సమయం. పది, ఇంటర్ విద్యార్థులకు కీలక సమయం. త్వరలో పరీక్షలు జరుగనున్నాయి. ఈ సమయంలో సానుకూల దృక్పథంతో ఉండాలి. అయిపోయిన పరీక్షల గురించి అస్సలు ఆలోచించకూడదు. రాయబోయే పరీక్షపైనే మనసు పెట్టాలి. మానసిక ప్రశాంతత కోసం ఉదయం నిద్ర లేచిన వెంటనే, రాత్రి పడుకోబోయే ముందు ధ్యానం చేస్తే ఎంతో ప్రయోజనం. వేపుళ్ల తగించి, ఆకుకూరలు తీసుకోవాలి. రాత్రి భోజనం ఎక్కువగా తీసుకుంటే త్వరంగా నిద్ర వస్తుంది. కనుక తక్కువ తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

గుర్తుకు తెచ్చుకునేలా..

పరీక్షల్లో ఒక ప్రశ్నకు సమాధానం రాస్తున్నప్పుడు కొన్ని సబ్‌హెడ్డింగ్స్ రాయాల్సి ఉంటుంది. చదివేటప్పుడు అన్నీ గుర్తు ఉన్నట్లు ఉంటుంది. రాసేటప్పుడు కొన్నే గుర్తుకు వస్తాయి. ఆ సమయంలో ఒత్తిడికి గురైతే నిరాశ చెంది.. తర్వాత ప్రశ్నలకు జవాబులు రాయలేం. ఇందుకు కారణం మెదడును సరైన రీతిలో వినియోగించుకోకపోవడం. జ్ఞాపక శక్తికి సంబంధించిన విధానాలను పాటించకపోవడం. పరీక్ష రాస్తుండగా గుండె వేగంగా కొట్టుకోవడం, కాళ్లు, చేతులకు చెమటలు పట్టడం, మెడ, తలనొప్పి, కంగారు పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవన్నీ చదవాల్సిన విధానంలో చదవకపోవడం వల్ల కలిగే అనర్థాలు. ఒక పాఠ్యాంశానికి సంబంధించిన వివరాలు మూలాల నుంచి నేర్చుకోకపోతే తర్వాత చదివేవి అంతగా జ్ఞప్తికి రావు. పాఠ్యాంశాన్ని పూర్తిగా అవగాహన చేసుకొని... ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకోవాలి. కొత్త ప్రశ్నలు ప్రస్తుతం చదవకూడదు. గతంలో చదివిన ప్రశ్నలను మాత్రమే చదివితే ప్రయోజనం ఉంటుంది.

బృంద చర్చలతో ఎంతో మేలు..

చదివిన అంశాలు పరీక్ష రాసే సమయంలో గుర్తుండాలంటే కొన్ని మెలకువలు పాటించాలి. పాఠాలు బాగా అర్థం చేసుకుని చదవాలి. ముగ్గురు లేక నలుగురు విద్యార్థులు బృందంగా కలిసి చదువుకోవాలి. ఒక్కొక్కరు విభిన్న ప్రశ్నలను చదివి వాటిని మిత్రులతో చర్చించుకోవాలి. దీనివల్ల ఒకే సమయంలో అనేక ప్రశ్నలు చదివినట్లవుతుంది. మరిచిపోయే అవకాశమూ ఉండదు. మంచి మార్కులు రావాలంటే అందుకు ఒక్కటే మార్గం. పాఠ్యాంశాలను అర్థం చేసుకోవాలే తప్ప బట్టీ పట్టే విధానం సరికాదు. పరీక్షల వేళ డీలా పడిపోతే సంవత్సరమంతా చదివింది వృథా అవుతుంది.

పరీక్షలకు ముందు ఏం చేయాలంటే...

- పరీక్షలకు ముందు అతిగా ఆహారం తీసుకోవడం... అసలు ఆహారం తీసుకోకపోవడం ఈ రెండు కూడా ప్రమాదకరమే. మెదడుకు గ్లూకోజ్ అవసరం. అందుకే అల్పాహారం తప్పక తీసుకుని పరీక్షకు వెళ్లాలి.
- అవసరమైన స్థాయిలో వ్యాయామం చేస్తే అది జ్ఞాపక శక్తిని పెంచుతుంది. వివిధ రకాల వ్యాయమాలు చేయడం ద్వారా శరీరానికి చెమటలు పట్టేలా చేయాలి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌లు పరీక్షల కాలంలో మానేస్తే మంచిది. వీటిలోని కొన్ని పదార్థాలు జ్ఞాపకశక్తిపై ప్రతికూలంగా పనిచేస్తాయి.
- చదువుతున్నప్పుడు 45 నిమిషాలకొకసారి 5 లేదా 10 నిమిషాలు విరామం ఇవ్వాలి. ఆ సమయంలో ఆకాశం వైపు చూస్తూ ముందుకు, వెనక్కు పది అడుగులు వేయాలి. దీనివల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది.
- పరీక్షల్లో రాబోయే ప్రశ్నలు సంవత్సరం పొడవునా తరగతుల్లో మీకు చెప్పినవే. మీరు చదివినవే. మొత్తం మీద మీ సిలబస్ నుంచే వస్తాయని విద్యార్థులకు ఉపాధ్యాయులు ధైర్యం చెప్పాలి.
- పరీక్షా కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు గుడ్లు, పాలు, కూరగాయలు వంటి సాత్వికాహారం తీసుకోవాలి. మాంసాహారానికి సాధ్యమైనంత దూరంగా ఉండాలి. ధృడమైన మనస్సుతో ముందుకు వెళ్లాలి.

ఒత్తిడికి లోనుకావద్దు..

మనిషి జీవితమే ఓ యుద్ధం. ఆ యుద్ధంలో గెలుపే ధ్యేయంగా సాగాలి. ముఖ్యంగా యువత తమ లక్ష్యాన్ని చేరుకునేలా శ్రమించాలి. అందుకు తగ్గ ఆత్మస్థైర్యం పొందాలి. ధైర్యంతో అడుగు ముందుకు వేయాలి. పరీక్ష అంటే కొందరు ఆందోళనకు లోనవుతారు. తల్లిదండ్రులు, విద్యాలయాల్లో గురువులు పిల్లలకు ధైర్యం చెప్పాలి. కష్టమైన సబ్జెక్టులు ఎక్కువ సమయం, సులభమైన వాటికి తక్కువ సమయాన్ని విభజించుకోవాలి.

పరీక్షకు 2 గంటల ముందు చర్చలు వద్దు..

చదివే ముందు ఎవరితోనూ గొడవలు పెట్టుకోవద్దు. వాదనలు అసలే వద్దు. ప్రారంభించాక టీవీ చూడకూడదు. చదివే క్రమంలో రెండు ఇష్టమైన సబ్జెక్టుల మధ్య ఒక కష్టమైన సబ్జెక్టు చదవాలి. పరీక్షలకు 2 గంటల ముందు సబ్జెక్టుపై చర్చలు వద్దు. దించిన తల ఎత్తకుండా రాయకూడదు. అప్పుడప్పుడు రెండు నిమిషాల సేపు తలెత్తి ఉపశమనం పొందాలి. ఆ సమయంలో ఏ ప్రశ్న అడిగారనేది సరిగ్గా అర్థం చేసుకుని జవాబు రాయాలి. కాగితంపై మరీ గట్టిగా రాయకూడదు. దీనివల్ల చెయ్యి నొప్పి వచ్చి సరైన వేగంగా రాయలేకపోతారు. కొత్త పెన్ను వద్దు. అలవాటు ఉన్న పెన్నుతోనే రాయలి. రెండు పెన్నులు ఒకే మాదిరివి దగ్గర ఉంచుకోవాలి.

భయం వీడాలి..



పదో తరగతి విద్యార్థులు ముందుగా పరీక్షలు అంటే భయాన్ని విడనాడాలి. ఉపాధ్యాయుల సూచనల మేరకు ప్రశాంతంగా చదవాలి. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా ఉపాధ్యాయులు ఇచ్చే సూచనలు పాటించాలి. ఇంటి వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలను ఆందోళనకు గురి చేయవద్దు. సెల్‌ఫోన్లు, టీవీలకు పరీక్షలు పూర్తయ్యే వరకు దూరంగా ఉంచాలి.

-పైడి వెంకటరావు, ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసన్నపేట



శోభారాణిని సత్కరిస్తున్న డీఈవో తదితరులు

ఒత్తిడికి గురికావద్దు

- జిల్లా విద్యాశాఖాధికారి తిరుమలచైతన్య

టెక్కలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమలచైతన్య అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలకు ప్రణాళికలతో చదువుకొని మార్కులు సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవడం ద్వారా అను కున్న లక్ష్యాలు సాధించగలుగుతారని చెప్పారు. ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్, ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శోభారాణిని డీఈవో సత్కరించారు.

అమ్మో.. జీబీఎస్

(ఐదో పేజీ తరువాయి)

జీవనశైలి అలవరుచుకుంటే ప్రయోజనముంటుంది.

అంటు వ్యాధి కాదు..

జీబీఎస్ అనేది అంటువ్యాధి కాదు. పైగా ఒకేసారి అధిక కేసులు నమోదు కావు. కనీసం రెండు లక్షల మంది జనాభాలో ఒకరిద్దరికి మాత్రమే జీబీఎస్ లక్షణా లు కనిపిస్తాయి. అధికారికంగా నమోదైన కేసు ఒకటే. అది కూడా పూర్తిస్థాయిలో పరీక్ష జరగలేదని తెలు స్తోంది. అయినా ప్రజలు కొన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలి. కలుషిత ఆహారం.. కలుషిత నీటిని తీసు కోకూడదు. గాలి ద్వారాను ఈ వ్యాధి సోకే అవకాశ ముంది. అలా అని పెద్దగా భయపడాల్సిన పనిలేదు. జీబీఎస్ కేసులు నమోదైతే రిమ్స్ (ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి)లో న్యూరాలజీ విభాగం, జనరల్ మెడిసన్ విభాగం చికిత్స అందిస్తుంది. ఇది అంటువ్యాధి కాకపో వడంతో ప్రత్యేక వార్డు, క్వారంటైన్ అవసరం లేదు.

-బాలమురళీ కృష్ణ, డీఎంహెచ్‌వో

శ్రీముఖలింగేశ్వరుని ఆదాయం రూ.3.33 లక్షలు

జలుమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరాలయంలోని హుండీ ఆదాయం రూ. 3,33,634 వచ్చినట్లు ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో మంగళవారం హుండీ తెరిచి లెక్కించారు. 84 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఈవో టి.రవి, కొమనాపల్లి సాయి భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై వాహన చోదకుల ఇక్కట్లు

ఏడు వరకూ మంచు తెరలే

నరసన్నపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉదయం ఏడు గంటల వరకూ మంచు తెరలు వీడటం లేదు. చలిగాలులూ ఉంటున్నాయి. మరోవైపు మధ్యాహ్నం నుంచి ఉక్కపోత మొదలవుతోంది. వేసవి కాలం వచ్చే సమయంలో ఇలా జరుగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సూర్యోదయమైన చాలా సేపటి వరకు మంచు తెరలు తొలగకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వస్తున్న... తమ ముందు వెళుతున్న వాహనాలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. సారవకోట, జలుమూరు, నరసన్నపేట, పాతపట్నం ప్రాంతాలు పొగమంచుతో నిండిపోతున్నాయి. దీని వల్ల మామిడి, జీడి పూత దెబ్బ తింటోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా వాసుదేవుని బ్రహ్మోత్సవాలు

- మందసలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

హరిపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మందసలో వెలసిన వాసుదేవ పెరు మాళ్ బ్రహ్మోత్సవాలను రెండో రోజు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 16వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదట వాసుదేవ పెరుమాళ్ స్వామికి పంచామృతంతో ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సుప్రభాత సేవతో ప్రారంభించి... ప్రాతఃకాలారాధన, నివేదన, గోష్ఠి, యాగశాలలో ద్వార తోరణ, ధ్వజ కుంభారాధన, వేదవిన్నపములు, విశేష హోమాలు చేశారు. అనంతరం సాయం సంధ్య వేళలో శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణ, యాగశాలలో ద్వారతోరణ, ధ్వజ కంభారాధన, వేదవిన్నపములు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ప్రధాన అర్చకులు కూర్మాచార్యుల అనుగ్రహ భాషణం చేశారు. స్వామి విశిష్టతను వివరించారు. ప్రతి ఒక్కరిలోనూ దైవభక్తి పెరిగితే ధర్మం, న్యాయం, శాంతి వంటివి సమపాళ్లలో ఉంటాయని హితవు పలికారు. వేద పండితులు గోవిందస్వామి, సత్యానందపాడి, పవన్ స్వామి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మందస యువత సహాయ సహకారాలు అందిస్తున్నారు. అనంతరం లోహరిబంద శ్రీమన్నారాయణ భక్త బృందం, బి.గొనపపుట్టుగ, మందస మహేంద్ర కళా మండలి ఆధ్వర్యంలో సంగీత విభావరి ఏర్పాటు చేశారు.



స్వామివారికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

నేటి కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం ఉదయం 9గంటలకు గరుడ పూజ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, హనుమద్వాహన సేవ, శ్రీరామ పూజలు చేస్తారు. సాయంత్రం దేవతాహ్వానం, శేషవాహన సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.



వాసుదేవుని ఆలయ ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

- అబార్షన్లకు గల కారణాలను సేకరించాల్సిందే
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.బాలమురళీకృష్ణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలమురళీకృష్ణ

అరసవల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, వివరాలు వెల్లడించడం చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. అటువంటి స్కానింగ్ సెంటర్లు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై శిక్షణ శిబిరాన్ని స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భస్థ శిశువు స్థితిగతులు తెలుసుకోవడానికి స్కానింగ్ చేయాలే తప్ప, వీటిని ఆసరాగా తీసుకుని శిశువు వివరాలు వెల్లడించేందుకు కాదని తెలిపారు. జిల్లాలో 108 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని.... ప్రతి స్కానింగ్ సెంటర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, వాటిపై ప్రోగ్రాం అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆదేశించారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే అబార్షన్ల వివరాలతో పాటు అందుకు తగిన కారణాలను సమర్పించాలని ఆదేశించారు. సమాజంలో స్త్రీ, పురుషులు ఇరువురూ సమానమేనని, స్త్రీల పట్ల వివక్ష ఉండరాదన్నారు. దీనిపై సమాజంలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఎంహెచ్‌ఓ తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్స్ సూర్యకళ, మోహిని మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణపై గ్రామ స్థాయి నుంచి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పుట్టబోయేది ఆడబిడ్డో, మగబిడ్డో తెలుసుకోవడానికి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం తప్పన్నారు. ఈ సమావేశంలో డీఐఓ రాందాస్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి తాడేల శ్రీకాంత్, డాక్టర్ మేరీకుమారి, డా.అర్.శ్రీనివాసరావు, ఎపిడిమాలజిస్ట్ డా.పి.సుజాత, పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ పాల్గొన్నారు.

ఒకేరోజు 260 పెండింగ్ సమస్యల పరిష్కారం

- జేసీ చొరవతో వెబ్‌ల్యాండ్‌లో దిద్దుబాటు

టెక్కలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కార్యాల యాల చుట్టూ తిరగకుండా ఉండేలా జేసీ స్థాయి అధికారి లాగిన్‌లో ఉన్న 260 సమస్యలకు జేసీ ఫర్మాద్ అహ్మద్ ఖాన్ ఒకేరోజు పరిష్కారం చూపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్లు, రీసర్వే డీటీలు, సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్, వీఆర్వోలను పిలిచి రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన అర్జీలు, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌లో వచ్చిన అర్జీలను పరిశీలించి వాటిని పరిష్కరించి రైతులకు న్యాయం చేశారు. వెబ్ ల్యాండ్ కరెక్షన్లు (జీరో ఎక్స్‌టెంట్), ఒక సర్వే నెంబరు బదులు మరో నెంబరు పడడం, అదనపు సర్వే నెంబర్ యాడింగ్‌లు, ఒకే ఖాతా నెంబరు ఇద్దరికి ఇవ్వడం, ఒకే రైతుకు రెండు ఖాతాలి వ్వడం, ఒక ల్యాండ్ పార్శల్ మ్యాప్ ఇంకొకరికి యాడ్ చేయడం, జిరాయితీ భూములు ప్రభుత్వ భూములుగా పడగా వాటిని సరిదిద్దడం వంటి సమస్యలను జేసీ పరిష్కరించారు. దీనికి సంబంధించి శ్రీకాకుళం కలెక్టరేట్ నుంచి సూపరింటెండెంట్లు, డీటీలు రామ్మూర్తి, పద్మావతి, సోనీ కిరణ్ తదితరులు వచ్చి జేసీ లాగిన్‌లో అక్కడికక్కడే చేర్పులు, మార్పులకు శ్రీకారం చుట్టారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమైంది.



రైతుల ల్యాండ్ క్లాసిఫికేషన్ సమస్యలను పరిష్కరిస్తున్న జేసీ ఫర్మాద్ అహ్మద్ ఖాన్

సమన్వయంతో గ్రూప్-2 పరీక్షల నిర్వహణ

- రెవెన్యూ డివిజినల్ అధికారి సాయిప్రత్యూష

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న జరుగనున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో కె.సాయి ప్రత్యూష అధికారులకు సూచించారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆమె మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్దతాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సరఫరా, వైద్య సదుపాయం వంటి ఏర్పాట్లు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ, పోలీసులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

పింఛన్ సొమ్ము తిరిగిచ్చేశారు



ఎంపీడీవోకు నగదు అందజేస్తున్న సర్వేయర్ అమ్మమ్మ రామలక్ష్మి

జి.సిగడాం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛన్‌ను లబ్ధిదారులకు పంచగా మిగిలిన రూ.49 వేలుతో పెంట సచివాలయ సర్వేయర్ చదువుల భానుప్రతాప్ పరారైన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం పత్రికల్లో కథనాలు రావడంతో ఆయన అమ్మమ్మ పారుపల్లి రామలక్ష్మి అవాక్కయ్యారు. ఆ మొత్తాన్ని సచివాలయ సిబ్బంది సమక్షంలో ఎంపీడీవో రామకృష్ణకు మంగళవారం ఆమె అందించారు. తన మనవడు భానుప్రతాప్ తండ్రి మృతి చెందడంతో పాటు కుటుంబ పరిస్థితి బాగోలేక మానసికంగా కుంగిపోయి ఇంటికి చేరకుండా తిరుగుతుంటాడని చెప్పారు. తాను కూడా ఒక పింఛన్‌దారునని, ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కాకూడదని, తోటి ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఆ మొత్తాన్ని అందజేశానని తెలిపారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

జి.సిగడాం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు దృష్టి సారించాలని ఏవో ఎర్రా శారద అన్నారు. మంగళవారం నాగులవలసలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడాలన్నారు కార్యక్రమంలో వీఏఏ తలచింతల కుసుమ, పంచాయతీ కార్యదర్శి చైతన్య కుమారి, రైతులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

ఆమదాలవలస, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బెలమాం పంచాయతీ పరిధిలోని ఉపాధ్యాయులకు ఓటరు స్లిప్పులను సచివాలయ విద్యా సంక్షేమ సహాయకుడు జి.సూర్యప్రకాష్ మంగళవారం పంపిణీ చేశారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు దాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలి: ఆర్డీవో

పొందూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతుల సమక్షంలోనే భూ రీసర్వే నిర్వహించాలని శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. మండలంలో పెనుబర్తి, కనిమెట్ట గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను మంగళవారం క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. గతంలో జరిగిన తప్పిదాలు, పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండాలంటే రైతులకు నోటీసులు జారీచేసి వారి సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువల పక్కన ఉన్న భూముల్లో సర్వే చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకటేష్ రామానుజులుకు సూచించారు. రీసర్వే డీటీ వైకుంఠరావు, మండల సర్వేయర్ గణపతి పాల్గొన్నారు. ● రెవెన్యూ సదస్సుల్లో శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లోని పొందూరు, ఆమదాలవలస, ఎచ్చెర్ల మండలాల నుంచి 8వేల ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో సాయిప్రత్యూష తెలిపారు. దళ్లవలస రెవెన్యూలోని భూ సమస్యలపై ఆమె వీఆర్వోలు, సర్వేయర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. దళ్లవలసలోనే ఎక్కువ ఫిర్యాదులు ఉన్నాయని, వీఆర్వో లేకపోవడంతో పరిష్కరించేందుకు ఇబ్బంది వస్తోందని సచివాలయ కార్యదర్శి జగదీష్, గ్రామస్థులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. వీఆర్వోను నియమించి ఫిర్యాదులు పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. నోటీలకు స్పందించిన రైతుల సమస్యలన్నింటినీ 5 రోజుల్లోగా పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

కృష్ణా యూనివర్సిటీ వీసీగా రామ్‌జీ



కూన రామ్‌జీ

పొందూరు/ఎచ్చెర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పొందూరు మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన కూన రామ్‌జీ కృష్ణా యూనివర్సిటీ(మచిలీపట్నం) వైస్‌చాన్సలర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రామ్‌జీ గతంలో ఎచ్చెర్లలోని అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీగా పని చేశారు. రామ్‌జీ నియామకంపై గ్రామస్థులతో పాటు ఎమ్మెల్యే రవికుమార్, కూన సత్యనారాయణ, కూన ప్రమీల, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, బాడాన గిరి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

'విజయగౌరిని గెలిపించండి'

ఆమదాలవలస, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ తరఫున పోటీ చేస్తున్న ఏపీయూటీఎఫ్ సీనియర్ నాయకురాలు కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సంపదరావు కిషోర్, టీవీజీ భాస్కరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాలలో ప్రచారం చేపట్టారు. విజయగౌరికి ఉపాధ్యాయులు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తమ్మినేని పాపారావు, పైల అప్పలనాయుడు, చింతాడ వెంకటసత్యనారాయణ, బెజ్జిపురపు సూర్యనారాయణ, మెండ శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి



మాట్లాడుతున్న యుగంధర్

అరసవల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తక్షణమే మెగా డీఎస్సీ నిర్వహించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్.ఆర్.క్రాంతి భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఏమైందని ప్రశ్నించారు. యువజన సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొన్న శ్రీనివాస్, నాయకులు ఎస్.రామోజీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

ఆమదాలవలస, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా పొందాలని వ్యవసాయశాఖ జేడీ కె.త్రినాథస్వామి అన్నారు. మంగళవారం టి.జొన్నవలస, చింతాడ సచివాలయాల్లోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి రైతుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. రైతులకు గుర్తింపు సంఖ్య ఉంటేనే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందుతారని తెలిపారు. అనంతరం మునగవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మెట్ట మోహన్‌రావు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తాం

పొందూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలుపుదల చేస్తామని డ్వామా పీడీ బి.సుధాకర్ అన్నారు. నందివాడ, నర్సాపురం గ్రామాల్లో జరిగిన వివిధ పనుల నాణ్యతను ఆయన మంగళవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాసరావు, టీఏ, ఎఫ్ఏ రైతులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తేనే కూలి గిట్టుబాటు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేస్తేనే ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీడీ కె.లోకేష్ అన్నారు. బొంతలకోడూరులో జరుగుతున్న చెరువు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. వేతనదారులు ఎనిమిది గంటలు పని చేస్తే గరిష్ఠ వేతనం పొందుతారని అన్నారు. ఆయన వెంట ఏపీవో శోభాదేవి, ఈసీ నారాయణమ్మ, టీఏలు ఉన్నారు.

ఘనంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఫెస్టివల్

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కొళిగాం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయిక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శన



టార్గెట్ అయిపోయింది..

- ధాన్యం కొనుగోలు చేయం
- బూర్జలో సేకరణను నిలిపేసిన మిల్లర్లు
- ఆందోళనలో రైతులు

బూర్జ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బూర్జ మండలంలో ధాన్యం కొనుగోలు నిలిచిపోయాయి. టార్గెట్ అయిపోయిందని చెప్పి మిల్లర్లు ధాన్యం తీసుకోవడం లేదు. దీంతో చీడివలస, నారాయణపురం, సింగన్నపాలెం, బూర్జ, వావాం, లంకాం, తుడ్డలి, తదితర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. వారికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. గత డిసెంబరులో ఏర్పడిన తుఫాన్ల కారణంగా వరి కోతలు, నూర్పులు ఆలస్యమయ్యాయి. ఇప్పటికీ చాలా గ్రామాల్లో 50 శాతానికి పైగా వరి కుప్పలు పొలాల్లోనే ఉన్నాయి. మండలంలో గత ఖరీఫ్‌లో 11,658 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. 10,740 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా అధికారులు పెట్టుకున్నారు. అయితే, తొలి విడత 4,970 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా 5,770 మెట్రిక్ టన్నులు సేకరించాల్సి ఉంది. కానీ, టార్గెట్ పూర్తయ్యిందంటూ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడం లేదు. గత డిసెంబరులో కురిసిన వర్షాలకు గాను 50 శాతానికి పైగా వరి పొలాల్లో నీరు చేరింది. దీని కారణంగా పంటను కళ్లాలకు తరలించలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా సకాలంలో నూర్పులు జరగలేదు. ఈలోగా రబీ సీజన్ వచ్చేసింది. దీంతో అపరాల పంట చేతికందిన వరకు వరి కుప్పలను నూర్చి, అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం అపరాలు పంట చేతికి అందింది. ఇప్పుడు చాలా గ్రామాల్లో వరి నూర్పులు చేస్తున్నారు. ఈ ధాన్యాన్ని సంచులకు ఎత్తుకొని రైతులు మిల్లర్లను సంప్రదించగా టార్గెట్లు పూర్తయ్యాయని వారు చేతులెత్తేస్తున్నారు. సత్వరమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టాలని కోరుతున్నారు.

కొనుగోలు చేయడం లేదు



నేను రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. గత డిసెంబరులో ఏర్పడిన తుఫాన్ కారణంగా పంటను తరలించలేక పొలంలోనే కుప్పలు వేశాను. ఇప్పుడు నూర్చుకొని అమ్ముదామంటే మిల్లర్లు టార్గెట్ అయిపోయిందని చెప్పి కొనుగోలు చేయడం లేదు.

-టంకాల రాంబాబు, రైతు, సింగన్నపాలెం

ఆందోళన చెందవద్దు



మండలంలో తొలివిడత 4,970 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. రెండో విడతలో మిగతా 5,770 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు.

- శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి

ఇది బిర్యానీ అంట!

● కవిటిలో మధ్యాహ్న భోజనం తీరుపై విమర్శలు



ఈ చిత్రం చూసి ఇది ఉప్మా అనుకుంటే పొరబడినట్లే. ఇది కవిటి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థుల కోసం వండిన బిర్యానీ. ముద్దగా ఉండడాన్ని చూసి చాలామంది విద్యార్థులు తినకుండానే వెనుతిరిగారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగోవడం లేదని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ విషయం మంగళవారం సోషల్ మీడియాలో వెలుగులోకి రావడంతో ఎంఈవో ధనుంజయ మజ్జి స్పందించారు. బియ్యం కొత్తవి రావటంతో సమస్య ఏర్పడుతుందని, ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూస్తానన్నారు. దీనిపై సివిల్ సప్లయి డీటీ సంతోష్ మాట్లాడుతూ.. బియ్యంలో పోర్టుఫైడ్ అధికంగా కలవడంతో ముద్దగా అన్నం వస్తుందని, పాఠశాలలకు పాతబియ్యం అందేలా చూస్తామని అన్నారు.

-కవిటి

ఆరు కిలోలు ఎక్కువ ఇస్తేనే అన్ లోడింగ్



మిల్లు వద్ద ధాన్యం బస్తాలతో ఉన్న ట్రాక్టర్లు

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మండలం బొబ్బిలిపేట గ్రామానికి చెందిన చింతాడ అప్పారావుతో పాటు మరికొంతమంది రైతులు మండలంలోని చిన్నపాలెం సమీపంలోని ఓ రైస్ మిల్లుకు మంగళవారం ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తీసుకెళ్లారు. అయితే, తేమ శాతం అధికంగా ఉందని, బస్తా(80కిలోలు)కు ఆరు కిలోల ధాన్యం ఎక్కువ ఇవ్వాలని, లేదంటే ధాన్యం దించేది లేదని మిల్లు నిర్వాహకులు తిప్పి పంపించి నట్టు రైతులు వాపోతున్నారు. ఈ విషయమై డీటీ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా.. 'తరుగు పేరుతో రైతుల వద్ద ధాన్యం డిమాండ్ చేయరాదు. వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

ఇలా వచ్చారు.. అలా వెళ్లిపోయారు

● మొక్కుబడిగా బూర్జ మండల సర్వసభ్య సమావేశం



మండల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

బూర్జ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మొక్కుబడిగా సాగింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి సభ్యులు, అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. కొందరు సభ్యులు ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయారు. ముందుగా కొందరు అధికారులు తమ శాఖలో జరిగిన అభివృద్ధి పనుల నివేదికలను చదివి వినిపించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. కాగా, మూడు నెలలకు ఒక సారి జరిగే మండల సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించాల్సి ఉంది. కానీ, పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు రామారావు, వైస్ ఎంపీపీ సూర్యారావు, కృష్ణమూర్తి నాయుడు, ఎంపీడీవో తిరుపతిరావు, తహసీల్దార్ పద్మావతి పాల్గొన్నారు.

షట్టర్ల మరమ్మతులు తక్షణం చేపట్టండి

● ప్రభుత్వ విప్ బెందాళం అశోక్



అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

కంచిలి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగాసాగరం ప్రాజెక్ట్ షట్టర్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇరిగేషన్ అధికారులతో కలసి గంగాసాగరం పరిశీలించారు. మూడు ప్రధాన షట్టర్లు పూర్తిగా పాడైయ్యాయని, తక్షణమే వాటిని బాగు చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు అయ్యేలా చూడాలని, కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరుకు కృషిచేస్తానని తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ సీఈ రాంగోపాల్, ఎస్ఈ కృష్ణారావు, ఈఈ డి.సుధాకర్, డీఈలు కె.లీనా, జి వెంకటరమణ, జేఈ సూర్యప్రకాష్, మధుసూదన్ పాణిగ్రాహీ, కూటమి నాయకులు, రైతులు ఉన్నారు.

గ్రోయిన్ల ఆధునికీకరణకు రూ.21కోట్లు విడుదల

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని బాహుదా నది నుంచి మండల రైతాంగానికి సాగునీరందించేందుకు అవసరమైన 11 గ్రోయిన్ల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.21కోట్లు నిధులు విడుదల చేసినట్లు కూటమి నాయకులు తెలిపారు. ఈసందర్భంగా ఇరిగేషన్ అధికారులతో కలసి వారు బాహుదా నది, గ్రోయిన్లను మంగళవారం పరిశీలించారు. హరిపురం, రాజగాయి, శాసనాం, బిర్లంగి, లొద్దపుట్టి, బెల్లుపడ, ఈదుపురం, రత్తకన్న, కేశుపురం, బూర్జపాడు, డొంకూరు తదితర 11 గ్రోయిన్ల ఆధునికీకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, నాయకులు సాడి సహదేవురెడ్డి, కామేశ్వరరావు, బెర రాజేంద్రప్రసాద్, మేరుగు సూర్యనారాయణ, ఆశి లీలారాణి, అంబటి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నక్క వీధిలోని ఉమా జలేశ్వరాలయంలో మహాశివరాత్రి కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వహకులు ప్రకటనలో తెలిపారు. 24న మహారుద్రాభిషేకం, పుష్పార్చన, 25న రుద్రహోమం, బిల్వార్చన, 26న అభిషేకాలు, లింగోద్భవ, 27స్వామి కల్యాణ మహోత్సవం, 28న త్రిశూల స్నానాలు నిర్వహిస్తామని చెప్పారు.

సంతోషిమాతకు పూజలు

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి నూతన వస్త్రాలను అలంకరించారు.

పబ్లిక్ నోటీసు

[illegible]

THE SCHEDULE PROPERTY:

Andhra Pradesh State, Srikakulam District, Pathapatnam Sub-Registrar office duration, Pathapatnam Mandal, Pathapatnam Revenue Group, Pathapatnam Panchayat, Pathapatnam Village, near Housing Board Colony and Near Pathapatnam Railway Station, 4th Ward, by nearest Door No:4-256, Patta No:437, Survey No:257-1a in the total Extent of Ac 00-35cents. The said Schedule Property Plot Numbers:3,4 extent is as follows: Measuring of Sale Extent: East-West: 62fts or 18.6Mts, North-South; 30fts or 9Mts, Area 206.66Sq.yds or 167.4Sq.Mts. Total Boundaries of the Schedule Property: East: Dry Land of the Vendor (Manchu Polayya), South: Plot Numbers Vacant Site of Aleti Chandrarao, West: Railway Station Road, North: Plot Numbers 1,2 Vacant Sites of Anni Gopal Rao.

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204


ఉషు పోటీలకు వర్సిటీ క్రీడాకారులు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని చండీఘడ్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22 నుంచి జరగనున్న అఖిల భారత మహిళా ఉషు పోటీల్లో బీఆర్ఏయూ క్రీడాకారులు ఆర్.పావని, ఎం.శిరీష పాల్గొననున్నారు. వీరిని వర్సిటీ వీసీ కె.ఆర్.రజని, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, స్పోర్ట్స్ డీన్ రవికుమార్, కార్యదర్శి ఎ.భాస్కర్ అభినందించారు. కోచ్‌గా కె.మురళీమోహన్ వ్యవహరిస్తున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా: ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఏ కాలనీలోని తన కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార మండలాల ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

గుజరాతీపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ధ్రువపత్రాలు పొందాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక జిల్లా న్యాయసేవా సదన్‌లో మంగళవారం న్యాయ విభాగ విద్యార్థులకు పలు రిజిస్ట్రేషన్లు, సర్టిఫికెట్లపై అవగాహన కల్పించారు. ప్రతి వ్యక్తికీ జనన ధ్రువీకరణ పత్రం ఎంత అవసరమో ఆ వ్యక్తి చనిపోయిన తర్వాత మరణ ధ్రువపత్రం కూడా అంతే అవసరమన్నారు. పెళ్లయిన ప్రతిఒక్కరూ వివాహ ధ్రువపత్రం పొందాలన్నారు. అలాగే కుల, ఆదాయ, తదితర ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఇతర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రియేటివ్, కల్చర్ కమిషన్, ఫైన్ ఆర్ట్స్ అకాడమి (గుంటూరు) నిర్వహించిన 19వ జాతీయ చిత్రలేఖన పోటీలు, చిత్ర కళా ప్రదర్శనలో దుప్పలవలస బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఏడో తరగతి విద్యార్థులు బోనెల తేజ, బొమ్మాళి ప్రసన్న కుమార్, తోట చెర్రి, సవర నిఖిల్, కె.కార్తీక్ బంగారు పతకాలు, జి.వరుణ్‌సాయి, పి.రాఘవ, పి.చరణ్‌కుమార్ వెండి పతకాలు సాధించారు. బోనెల తేజకు బాల చిత్ర కళారత్న అవార్డుతోపాటు రూ.2 వేలు నగదు ప్రోత్సాహకం అందించారు. విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ బి.రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

రెవెన్యూ సేవల్లో తీవ్ర జాప్యం

- టెక్కలి, సంతబొమ్మాళిలో తహసీల్దార్ పోస్టుల ఖాళీ
- సెలవుపై ఎల్ఎన్‌పేట తహసీల్దార్
- ఇబ్బందులుపడుతున్న ప్రజలు
- ఇదీ టెక్కలి డివిజన్‌లోని తీరు

టెక్కలి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): టెక్కలి రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జిలతో కాలం నెట్టుకొస్తున్నారు. దీంతో రెవెన్యూపరంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డివిజన్‌లోని టెక్కలి, సంతబొమ్మాళి తహసీల్దార్ల పోస్టులు ఖాళీ కాగా, ఎల్ఎన్‌పేట తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో ప్రస్తుతం ఆయా మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే రెవెన్యూ సేవల్లో వెనుకబడుతున్న యంత్రాంగం అధికారుల పోస్టుల ఖాళీ కారణంగా తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా సంతబొమ్మాళి మండలంలో మూలపేట పోర్టు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో తహసీల్దార్ ఆవశ్యకత ఎంతైనా ఉంది. పోర్టు భూముల వ్యవహారాలు, పోర్టు పరిధిలో రోడ్డు, రైల్వే మార్గాల పెండింగ్ పనుల పరిశీలన, ఉప్పు భూముల సమస్యలు, పోర్టుకు భూములిచ్చిన రైతుల పీడీఎఫ్, పీఏఎఫ్ అంశాలు, నిర్వాసితులకు స్థలాల కేటాయింపు తదితర అంశాలతో పాటు పారిశ్రామికంగా సంతబొమ్మాళి మండలంలో పెట్రో కెమికల్స్ సంస్థలకు భూ కేటాయింపులు, భావనపాడు హార్బర్ నిర్మాణం, టూరిజం పార్కు అభివృద్ధి ఇలా అనేక ప్రధాన సమస్యలను రెవెన్యూ శాఖ పరిష్కరించాల్సి ఉంది. అలాగే టెక్కలి మండలంలో జగతిమెట్ట ఇళ్ల కాలనీ అక్రమాలు, భూకబ్జాలు, ఆక్రమణలన గుర్తించడం రెవెన్యూ అధి కారులకు కత్తిమీద సాములా తయారైంది. ప్రతి సోమవారం ప్రజల నుంచి 'మీకోసం'లో ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించడం, మ్యుటేషన్లు, ధాన్యం కొనుగోలు, విద్యార్థులకు సంబంధించిన పలు రకాల ధ్రువపత్రాల జారీ, నాలా, నీటి తీరువా వసూళ్లు, రీ సర్వే పెండింగ్ సమస్యలు ఉన్నాయి. కొన్ని మండలాల్లో ఇసుక ర్యాంపులు, అక్రమ తవ్వకాలు తదితర సమస్యలతో పాటు 64 రకాల రెవెన్యూ సేవలు చేయాల్సి ఉంది. అయితే సంబంధిత అధికారులు లేకపోవడంతో ప్రస్తుతం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అంతా తానై పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఉన్న సిబ్బందితోనే కాలక్షేపం చేయాల్సి వస్తోంది. దీంతో ఆయా సిబ్బందిపైనా అదనపు భారం పడుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా డివిజన్‌లో రెవెన్యూ సిబ్బంది పనితీరుపై ఇటీవల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఖాళీ పోస్టులను భర్తీ చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


టెక్కలి డివిజన్ మ్యాప్

పోస్టుల ఖాళీల అంశం కలెక్టర్ దృష్టిలో ఉంది



టెక్కలి, సంతబొమ్మాళి తహశీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎల్ఎన్‌పేట తహసీల్దార్ సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం డీటీలు ఇన్‌చార్జి లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న తహసీల్దార్ పోస్టుల అంశం కలెక్టర్ దృష్టిలో ఉంది. త్వరలో ఈ పోస్టుల భర్తీ అయ్యే అవకాశా లున్నాయి.

- ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో

వారం రోజులుగా తిరుగుతున్నాను



జనన ధ్రువీకరణ పత్రం కోసం వారం రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. అధికారులు రాలేదని రోజూ తిప్పుతున్నారు. దీంతో అనేక రీతులా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పనులు జరిగేలా చూడాలి.

-శిల్లా బుజ్జి, పెద్దకేశనాయుడుపేట, సంతబొమ్మాళి మండలం

ఇన్‌చార్జిలతో ఇక్కట్లు


అధికారుల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ లేకపోవడంతో రెవెన్యూపరంగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ప్రస్తుతం ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. దీంతో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఎవరికి వారే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. తహసీల్దార్‌గా పనిచేసిన రమేష్‌కుమార్ మూడు నెలల కిందట పదవీ విరమణ చేయడంతో కోటబొమ్మాళి తహసీల్దార్‌కు ఇన్‌చార్జిగా నియమించారు. డిప్యూటీ తహసీల్దార్ నారాయణరావు కొత్తూరుకు బదిలీ కాగా భూసర్వే డీటీ హరి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. హెచ్ఎన్‌పేట, దండుగోపాలపురం, ఆర్‌హెచ్‌పురం సచివాలయాలకు వీఆర్వోలు లేరు. ఈ పోస్టులు కూడా ఇన్‌చార్జిలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, అయినా పనులు జరగడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్ — వ్యాన్ ఢీకొని ట్రాక్టర్ బోల్తా


రోడ్డుకు అడ్డంగా పడిన ట్రాక్టర్

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తర్లిబొడ్డుపాడు గ్రామ సమీపంలో 16 నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాన్ ఢీకొని ట్రాక్టర్ బోల్తాపడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. టెక్కలి నుంచి కోటబొమ్మాళి వైపు వెళుతున్న ఖాళీ ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న మినీ వ్యాన్ బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదంతో కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో హైవే అధికారుల చొరవతో ఎక్స్‌కవేటర్ సాయంతో వాహనాలను పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సోంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన నర్సింగ్ మహంతి (49) సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బారువ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నర్సింగ్ కుమారుడు జగదీష్ మందస మండలం సొండిపుడిలో ఐటీఐ చదువుతున్నాడు. ప్రతిరోజూ సాయంత్రం నర్సింగ్ తన ద్విచక్ర వాహనంపై వెళ్లి కుమారుడిని ఇంటికి తీసుకు వస్తుంటాడు. సోమవారం కూడా జగదీష్‌ను తీసుకురావడానికి వెళ్తుండగా సుంకిడి సమీపంలో ద్విచక్ర వాహనానికి అడ్డంగా కుక్క రావడంతో అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. భార్య లక్ష్మీమహంతి ఫిర్యాదు మేరకు బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పలాసరూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో సారా విక్రయిస్తున్న లక్ష్మీనారాయణ పాత్రోను అరెస్ట్ చేసినట్లు కాశీబుగ్గ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కె.మల్లి కార్జునరావు తెలిపారు. అతని వద్ద నుంచి 3 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కొత్తూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడినా, గ్రామ జాతరలో పేకాట నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎండీ అమీర్‌ఆలీ తెలిపారు. బమ్మిడి గ్రామంలో మంగళవారం పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.1484 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అక్రమంగా కంకర తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

పాతపట్నం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కంకరను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ మంగళవారం పట్టుకుని సీజ్ చేసినట్లు తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్ తెలిపారు. అక్రమ తరలింపునకు వినియోగిస్తున్న ట్రాక్టర్‌ను, ఎక్స్‌కవేటర్‌ను గనులశాఖ అధికారులు అప్పగించామన్నారు.

కోట్లతో పరారైన వ్యక్తి కోసం ఆరా..!

పాతపట్నం/మెళియాపుట్టి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశ చూపి.. ఎక్కువ మొత్తం సేకరించి పరారైన వ్యక్తి కోసం ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అధిక వడ్డీ ఆశ చూపి రూ.60 కోట్లతో పరారీ?' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు గ్రామాల్లో ఇంటెలిజెన్స్ అధికారులు వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా డబ్బులిచ్చిన వ్యక్తులతో సదరు పరారైన వ్యక్తి మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. పోలీసులకు ఫిర్యాదులు చేయకుండా చూడాలని, దీనికి కొంత నగదు ఇస్తానని మధ్యవర్తుల ద్వారా మంతనాలు చేసినట్లు తెలిసింది. అయితే పాతపట్నం నియోజకవర్గంలో కొత్తూరు, హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో అధికంగా వడ్డీ ఇస్తామని చెప్పడంతో ఎక్కువ మంది సదరు వ్యక్తికి డబ్బులిచ్చారు. అయితే ఆ వ్యక్తి పరారైన సంగతి తెలుసుకుని వారంతా ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదని సీఐ వి.రామారావు తెలిపారు.

అవినీతి, అక్రమాలకు కేరాఫ్ తిలక్


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

టెక్కలి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు తిలక్, ఆయన కోటరీ చేయని అవినీతి, అక్రమాలు లేవని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు పినకాన అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వంశధార పరిధిలో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తిలక్ విమర్శలు చేస్తున్నారన్నారు. మైన్స్ విభాగంలో పెద్దఎత్తున అక్రమాలు జరి గాయని చెబుతున్నావని.. ఒక్కదానినైనా నిరూపించగలవా అంటూ తిలక్‌ను ప్రశ్నించారు. అదే పరిస్థితి ఉంటే తిలక్‌కు చెందిన క్రషర్ కూడా సీజ్ అయ్యేదని గుర్తుచేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు సంబంధిం చి నిధులతో అభివృద్ధి పనులు జరపడం లేదని ఆరోపించడం సరికాదని, కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రు లను విమర్శించే స్థాయి నీది కాదన్నారు. సమావేశంలో టెక్కలి మండల టీడీపీ అధ్యక్షుడు బగాది శేషగిరి, నేతలు హనుమంతు రామకృష్ణ, లవకుమార్, పోలాకి చంద్రశేఖర్, దల్లి ప్రసాద్‌రెడ్డి, లక్ష్మణ్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోండి


మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి సన్యాసినాయుడు

పాతపట్నం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పేద ఖైదీలకు ఉచితంగా అందిస్తున్న న్యాయ సేవలను వినియోగించుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. స్థానిక సబ్ జైలును మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఖైదీలతో మాట్లాడుతూ.. ఆర్థికంగా ఇబ్బందులున్న వారికి న్యాయవాదిని కేటాయిస్తామన్నారు. ఖైదీల ఆరోగ్య స్థితిగతులు, మెనూపై ఆరా తీశారు. అనంతరం పలు వసతి గృహాలను సందర్శించారు.

నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తే చర్యలు

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులను నిబంధనల మేరకు చేపట్టాలని, లేకుంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు అన్నారు. మల్లికార్జునపురం గ్రామ ఊర చెరువులో చేపట్టిన పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరు వులో రూ.9.66 లక్షలతో పనులు చేయాల్సి ఉండగా రూ.8 లక్షల మేరకే పనులు జరిగాయని, మిగిలిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా కరకవలసలో జి.రామశంకర్ పెర్క్యులేషన్ టాంకు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపంపై ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ పి.రాధ, ఏపీవో శ్రీదేవి, ఈసీ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పనిదినాలు వినియోగించుకోవాలి

కొత్తూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో లబ్ధిదా రులకు అందిస్తున్న పని దినాలను వినియోగించుకోవాలని డ్వామా పీడీ సుధాకరరావు అన్నారు. నేరడి పంచాయతీలో ఇటీవల చేపట్టిన కందకాల పనులను పరిశీలించారు. అనంతరం మహాసింగిగూడలో మాట్లాడుతూ.. అటవీ భూముల అభివృద్ధి కోసం వేతనదారులకు ప్రత్యేకంగా కల్పించిన 150 రోజుల పనిదినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ రాధ, ఏపీవో ప్రేమలత పాల్గొన్నారు.


ఎల్ఎన్‌పేట: మల్లికార్జునపురం ఊర చెరువు పనులను పరిశీలిస్తున్న పీడీ సుధాకరరావు

అనుమతులు లేకుండా రోడ్డు ఎలా వేస్తారు?

- పోర్టు అధికారులను ప్రశ్నించిన ఉప్పు పరిశ్రమ ప్రతినిధులు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తమ అనుమతులు లేకుండా ఉప్పు భూముల్లో ఎలా పోర్టుకు రోడ్డు నిర్మాణం చేపడతారని నౌపడ సాల్ట్‌రన్ 1956 ప్రైవేటు లిమిటెడ్ (ఎస్ఎస్) కంపెనీ ప్రతినిధులు మంగళవారం పోర్టు అధికారులను ప్రశ్నించారు. తమ అధీనంలో ఉన్న భూముల్లో ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా పోర్టు యాజమాన్యం రహదారి నిర్మిస్తుండడంతో ఎస్.ఎస్.కంపెనీ మేనేజర్ దివాకర్ షాతో పాటు ఉప్పు కార్మికులు సిబ్బంది పనులను అడ్డుకున్నారు. కనీస సమాచారం ఇవ్వకుండా మీకు ఇష్టం వచ్చినట్లు రోడ్డు నిర్మిస్తే ఉప్పు సాగుకు తీవ్ర నష్టం వస్తుందని నిలదీశారు. ప్రతి ఏటా 30 నుంచి 40 టన్నుల ఉప్పు పంట పండిస్తున్నామని, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తమ అధీనంలో ఉన్న భూముల్లో రోడ్డు నిర్మాణం చేపట్టడంపై హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు.


పోర్టు సిబ్బందిని రోడ్డు నిర్మాణంపై ప్రశ్నిస్తున్న ఎస్ఎస్ కంపెనీ మేనేజర్

సమయ పాలన పాటించండి: పీడీ


జలుమూరు: గ్రామసచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

జలుమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ ఆదేశించారు. శ్రీముఖలింగం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో సచివాలయ సిబ్బందే కీలకమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి మనపై నమ్మకం కలిగేలా పనిచేయాలన్నారు. అనంతరం వెలుగు కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవిందరావు, వెలుగు ఏపీఎం హేమసుందరరావు, పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయండి

నరసన్నపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహిళ సంఘాలు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి జమ్ము గ్రామ సమాఖ్యలో డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మహిళలు ముందడుగు వేయాలన్నారు. ప్రతిఇంటి వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీ కొండలరావు, వల్లయ్య, మెయ్య జగన్నాథం, టెంక శారద, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణపై శ్రద్ధ చూపాలి

హరిపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రికార్డుల నిర్వహణపై శ్రద్ధ చూపాలని జడ్పీ సీఈవో ఎల్ఎస్‌వీ శ్రీధర్ రాజా అన్నారు. మందస ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. రికార్డుల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల్లో నాణ్యత ఉండేలా పర్యవేక్షించాని ఎంపీడీవో రమేష్‌నాయుడుకు సూచించారు. అనంతరం వాసుదేవ పెరుమాళ్‌ను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో రుషి, బి.నవీన్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా

సమస్యలు పరిష్కరించండి

- పౌర సరఫరాల మంత్రిని కోరిన రైస్ మిల్లర్లు


మంత్రి నాదెండ్ల మనోహర్‌తో జిల్లా రైస్‌మిల్లర్స్ నాయకులు

పలాస, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను విజయవాడలోని సివిల్ సప్లై కార్యాలయంలో మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, ఉప కార్యదర్శి ఎల్.రమేష్ తదితరులు కలిసి సమస్యలను విన్నవించారు. ఇప్పటికే నిబంధనల కారణంగా జిల్లాలో అనేక రైస్‌మిల్లులు పూర్తిగా మూత వేయడం జరిగిందని, ఉన్నవి కొనసాగించాలంటే వారికి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు, రాయితీలు అందించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం గత వర్షాలకు తడిసి రంగుమారిన బియ్యం, నూకల బియ్యంపై ఆంక్షలున్నాయని, వాటిపై చర్యలు తీసుకొని మిల్లర్లకు న్యాయం చేయాలని కోరారు.

కొత్తపల్లి పాఠశాల సందర్శన

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కూర్చొని దిక్కులు, అయస్కాంతం తదితర అంశాలపై చర్చించారు. గతంలో జిల్లా కళా ఉత్సవంలో డ్యాన్స్, చిత్ర లేఖనం పోటీల్లో విజేతలైన పి.దివ్య, ఊర్వశిలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో విల్సన్, హెచ్ఎం గోవిందరావు, ఉపాధ్యాయుడు షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మబగాంలో వెలసిన శ్రీ చిన్నమ్మ తల్లి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు బగ్గు దంపతులకు సత్కరించి తీర్థప్రసాదాలిచ్చారు. కార్యక్రమంలో డా. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు అభినందన

నరసన్నపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం చోడవరం గ్రామంలో మోహన్‌బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అడపా శ్రీధర్, చంద్రశేఖర్, రజనీకాంత్ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యం 'గ్లో' లక్ష్యం

పలాసరూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందజేయడమే గ్లోసంస్థ లక్ష్యమని ఆ సంస్థ నిర్వాహకులు అన్నారు. కిష్టుపురం గ్రామంలో గ్లో సంస్థ, కిష్టుపురం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష సూచనలతో జెమ్స్ ఆసుపత్రి వైద్యులు సుమారు 170 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు దువ్వాడ శ్రీహర్షనాయుడు, బూర్లె కృష్ణంరాజు, తులసీరావు, ఢిల్లేశ్వరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మధురై నుంచి మధుర వరకు పాదయాత్ర



నరసన్నపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మ పరిరక్షణ కోసం ఉత్తర ప్రదేశ్‌లోని మధురై నుంచి తమిళనాడులో మధుర వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎడ్ల బండితో పాదయాత్ర బృందం నరసన్నపేటకు చేరుకుంది. సిద్ధాశ్రమంలో ప్రసంగం చేశారు. అనంతరం పట్టణ వీధుల్లో పర్యటించారు.

మహిళా సంఘాలకు వ్యక్తిగత రుణాలు

హరిపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పంచ సూత్రాలను పాటిస్తూ విజయవంతంగా సంఘాలను నిర్వహిస్తున్న మహిళలకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయనున్నట్లు యూనియన్ బ్యాంకు మేనేజర్ విద్యాధరరావు అన్నారు. మందస అన్నపూర్ణ ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం పి.కూర్మారావు, సీసీ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రామాల్లో సమగ్ర సర్వేపై విచారణ

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గతంలో సచివాలయం సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో హౌస్ ఓల్డ్ సర్వే చేసి, జియో ట్యాగింగ్ చేశారు. అయితే జాబితాల్లో మృతుల సంఖ్య భారీగా ఉండడంతో కమిషనర్ ఆదేశాల మేరకు మరోసారి గ్రామాల్లో విచారణ చేపడుతున్నట్లు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ అన్నారు. కిష్టుపురం గ్రామంలో మంగళవారం మరోసారి హౌస్ ఓల్డ్ సర్వే చేసినట్లు ఆయన తెలిపారు.

డీలర్ల సంఘ కార్యవర్గం ఎన్నిక

నరసన్నపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల రేషన్ డీలర్ల సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లావేటి మురళి, గౌరవాధ్యక్షుడిగా ఉణ్న బాల భాస్కరరావు, కార్యదర్శి రాడ సుహాసిని, ట్రెజరర్‌గా ఘంటాన సుమలతను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వి. భాస్కరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపించండి

జలుమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీటీ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి కోరారు. మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆనెం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.సింహాచలం, జిల్లా కౌన్సిలర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- పలాసరూరల్/మెళియాపుట్టి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు శ్రీహరి, నవ కోటేశ్వరరావు కోరారు. పలాస, మెళియాపుట్టి మండలాల్లోని పలు ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గుంట కోదండరావు, ఎస్.సిద్ధేశ్వరరావు, ఎల్‌వీ చలం, లక్ష్మీనారాయణ, రవి బుడ్డీడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు నిధుల విడుదలపై హర్షం

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం నుంచి నౌపడ వరకు రెండు లైన్ల రోడ్డు విస్తరణకు రూ.47.5 కోట్లు నిధులు విడుదల చేయడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు నిధుల విడుదలకు కృషి చేసిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహనాయుడును మంగళవారం శ్రీకాకుళంలోని ఆయన కార్యాలయంలో కలిసి అభినందించారు. మంత్రికి కలిసిన వారిలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, మాజీ సర్పంచ్‌లు షన్ముఖరావు, చింత నారాయణ, గోవిందు పాపారావు ఉన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి

పోలాకి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గాతలవలస-జడూరు-సుసరాం గ్రామాలను కలుపుతూ ఉన్న రోడ్డు పాడైందని, బీటీ రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని గాతలవలస యువజన సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ లక్ష్మణరావులకు వినతి పత్రాలు విన్నవించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

పాతపట్నం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ వి.రామారావు హెచ్చరించారు. స్థానిక ఆలాంధ్ర రోడ్‌లో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.